భట్టికి చిన్నపీటపై ప్రభుత్వం దిద్దుబాటు

ప్రొటోకాల్ ఉల్లంఘనపై చర్యలు

- యాదగిరిగుట్ట ఇన్‌చార్జి ఈఓపై వేటు!
- ఈఓగా భాస్కర్‌రావు నియామకం
- కొత్తగా మరో 10 పీటల కొనుగోలు

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు హాజరైన సీఎం రేవంత్ దంపతులు, మంత్రులు పెద్దపీటపై కూర్చోగా, పక్కన చిన్నపీటపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క (ఫైల్)

హైదరాబాద్/యాదాద్రి భువనగిరి, మార్చి 14(నమస్తే తెలంగాణ): యాదగిరిగుట్ట ఆలయంలో ఇటీవల జరిగిన ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా పనిచేస్తున్న రామకృష్ణారావును బాధ్యతల నుంచి తప్పించి రెవెన్యూ శాఖ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏ భాస్కర్‌రావును ఆ స్థానంలో నియమించినట్టు తెలిసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు సమాచారం. ఫారెన్ సర్వీసుల కింద డిప్యుటేషన్ పద్ధతిలో ఈ నియామకాన్ని జరిపినట్టు చెప్తున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఇతర మంత్రులతో సమానంగా కుర్చీల్లో కాకుండా చిన్న పీటలపై కూర్చోబెట్టారు. బలహీనవర్గాలకు చెందిన డిప్యూటీ సీఎంకు, దేవాదాయశాఖ మంత్రికి తీవ్ర అవమానం జరిగినట్టు రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. వివిధ దళిత, ప్రజాసంఘాలు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. భట్టివిక్రమార్క జోక్యం చేసుకొని తనకు అవమానం జరగలేదని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం స్పందించింది. డిప్యూటీ సీఎంతోపాటు దేవాదాయశాఖ మంత్రికి తగిన ప్రాధాన్యం కల్పించకపోవడం ప్రొటోకాల్ ఉల్లంఘన కిందకు వస్తుందని భావిస్తూ ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా కొనసాగుతున్న రామకృష్ణారావును ఆ బాధ్యతలనుంచి తప్పించినట్టు తెలిసింది. ఆయన స్థానంలో భాస్కర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు సమాచారం. అయితే, అధికారికంగా మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత లేదు. కేసీఆర్ హయాంలో ఈఓగా కొనసాగిన విశ్రాంత అధికారి గీతారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దీర్ఘకాల సెలవుపై వెళ్లారు. దేవాదాయ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న రామకృష్ణారావుకు ప్రభుత్వం యాదగిరిగుట్ట ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రొటోకాల్ వివాదం నేపథ్యంలో రెండున్నర నెలల్లోనే ఆయనను బాధ్యతల నుంచి తప్పించినట్టు వార్తలు రావడం గమనార్హం.

ఈసారి ఎంతమంది వచ్చినా ఓకే!

యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ ఆగ్రహావేశాలు వెల్లువెత్తిన నేపథ్యంలో మరోమారు అలాంటి ఘటనలు జరగకుండా ఆలయ అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. కొత్తగా పది పీటలు కొనుగోలు చేశారు. ఇప్పటికే నాలుగు పీటలు ఉండడంతో వీటి సంఖ్య 14 పెరిగింది. ఈ పీటలన్నీ ఒకే రకమైన ఎత్తుతో ఉండడం వల్ల ఒకేసారి 14 మంది వీవీఐపీలు వచ్చినా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆశీర్వచనం అందించేలా ఏర్పాట్లు చేశారు.

వ్యవసాయ కార్పొరేషన్లపై సర్కారు నజర్

- గత పదేండ్ల కార్యకలాపాల వివరాలివ్వాలని ఆదేశం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ అనుబంధ రంగాల కార్పొరేషన్లపై విచారణను ప్రభుత్వం వేగవంతం చేసింది. గత పదేండ్లలో నిర్వహించిన కార్యకలాపాల పూర్తి సమాచారాన్ని అందించాలని బుధవారం కార్పొరేషన్లకు లేఖలు రాసింది. వ్యవసాయ కార్పొరేషన్లపై విచారణ చేపట్టాలని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆ దిశగా దృష్టి సారించారు. సంస్థ కార్యకలాపాలు ఏంటి?, ఐదేండ్లలో ఏం పనులు చేశారు?, అప్పులెన్ని, అస్తులెన్ని, ప్రభుత్వం వద్ద పెండింగ్ పనులేమైనా ఉన్నాయా? వంటి వివరాలను సమర్పించాలని కార్పొరేషన్లను ఆదేశించారు. ఈ విచారణ వెనుక గత ప్రభుత్వంలో చేపట్టిన కార్యకలాపాలు తెలుసుకోవడం, కార్పొరేషన్ల పనితీరును మరింత మెరుపర్చడం వంటి కారణాలుండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యాపార నిమిత్తమే డీకేను కలిశా

- బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, మార్చి14 (నమస్తే తెలంగాణ): వ్యాపార నిమిత్తమే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు వస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. వ్యాపార సంబంధమైన విషయాలపై చర్చించేందుకు మధ్యవర్తి తనను బెంగళూరులో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వద్దకు తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని, పార్టీ మారే ఆలోచనే లేదని తేల్చిచెప్పారు. ఐదేండ్లు బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని మల్లారెడ్డి స్పష్టంచేశారు. మాజీ మంత్రి ప్రకటనతో కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరుతున్నారన్న వార్తలకు తెరపడినట్టయింది.

ఇలా వచ్చి అలా చేరితే టికెట్టా?

- కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ల లొల్లి
- కొత్తవారికి టికెట్ల ప్రచారంపై గుర్రు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సీనియర్లు
- దీపాదాస్ మున్షీకి ఫిర్యాదు
- నేడు 11వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): దశాబ్దకాలంగా పార్టీ అధికారంలో లేకున్నా అంటిపెట్టుకుని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి కాకుండా, కొత్తగా వచ్చిన వారికి టికెట్ ఇస్తారా? ఇదెక్కడి న్యాయం? అంటూ కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి. పార్టీ తీర్థం పుచ్చుకొనే కొత్తవారికి టికెట్ ససేమిరా ఇవ్వవద్దంటూ పట్టుబడుతున్నాయి. సీనియర్లను కాదని కొత్తవారికి టికెట్లు ఎలా ఇస్తారని నిలదీస్తున్నాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటి వరకు నాలుగింటిని మాత్రమే ప్రకటించిన కాంగ్రెస్ మిగతా స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై గాంధీభవన్‌లో రెండురోజులుగా కసరత్తు చేస్తున్నది. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పార్టీ నేతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్లు తమ అసంతృప్తిని వ్యక్తంచేశారు. పార్టీ అధికారంలోకి రాగానే ఇతర పార్టీల నుంచి వచ్చి చేరుతున్న నేతలకు టికెట్లు ఇవ్వడం సరికాదని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పున్నారు. స్పందించిన మున్షీ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ నేతలు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. కాంగ్రెస్ ఇప్పటి వరకు మహబూబ్‌నగర్, మహబూబాబాద్, జహీరాబాద్, నల్లగొండ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. మిగతా 13 స్థానాలకు కూడా అభ్యర్థుల ఎంపిక పూర్తయిందని, అధికారికంగా మాత్రమే ప్రకటించాల్సి ఉందన్న వార్తలు పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

దీపాదాస్‌ను నిలదీసిన అంజన్‌కుమార్

నిన్నకాకమొన్న బీఆర్ఎస్ నుంచి వచ్చి చేరిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు సికింద్రాబాద్ టికెట్ ఇస్తున్నట్టు జరుగుతున్న ప్రచారంపై మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీనైన తనకు కాకుండా కొత్తగా వచ్చి చేరినవారికి ఎలా ఇస్తారంటూ దీపాదాస్ మున్షీని నిలదీసినట్టు తెలిసింది. భువనగిరి టికెట్‌ను ఇటీవల అక్కడ ఓటమి పాలైన ఓ నేతకు ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతుండంతో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. పెద్దపల్లి టికెట్‌ను వివేక్ వెంకటస్వామి కుమారుడు వంశీకి ఇస్తున్నారన్న ఊహాగానాలపైనా కాంగ్రెస్ సీనియర్లు గుర్రుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి వచ్చిన వివేక్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని, ఇప్పుడు ఆయన కుమారుడికి ఇస్తామంటే ఎలా అని మున్షీకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఒకే కుటుంబానికి ఇన్నేసి టికెట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించినట్టు సమాచారం. ఇటీవల పార్టీలో చేరిన కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డికి మల్కాజ్‌గిరి టికెట్ ఖాయమంటూ వస్తున్న వార్తల పైనా నాయకులు గుర్రుగా ఉన్నారు. అభిప్రాయ సేకరణలో నేతలు వెల్లడించిన అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దీపాదాస్ హామీ ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు, ఎంపీ టికెట్ల ఖరారుపై శుక్రవారం ఢిల్లీలో జరగనున్న ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రేవంత్ ఢిల్లీకి వెళ్లడం ఇది 11వసారి కానుంది.

నైట్‌బజార్ స్టాళ్లు మహిళా సంఘాలకు

- శిల్పారామం పక్కన స్టాల్స్‌ను పరిశీలించిన సీఎం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): శిల్పారామం పక్కన నిరుపయోగంగా ఉన్న స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నైట్ బజార్‌లోని 119 స్టాళ్లను 2017 నుంచి నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. రైతు బజార్ తరహాలో స్వయం సహాయక మహిళా సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా స్టాల్స్‌ను తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం సూచించారు. వీటిని మహిళలకు మాత్రమే కేటాయించాలని ఆదేశించారు. ఇందుకు ఉత్తర్వులను సిద్ధం చేయాలని చెప్పారు.

మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి

జితేందర్‌రెడ్డితో రేవంత్ భేటీ

- పార్టీలో ఆహ్వానించేందుకేనని రాజకీయ వర్గాల్లో ప్రచారం
- పరామర్శించేందుకే వచ్చారని బీజేపీ నేత వివరణ

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ రాష్ట్రంలో రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. మహబూబ్‌నగర్ టికెట్ ఆశించి భంగపడిన బీజేపీ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లడం రాజకీయ చర్చకు కారణమైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికివెళ్లి భేటీ అయ్యారు. జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించేందుకే సీఎం ఆయన ఇంటివెళ్లారన్న ప్రచారం జోరుగా సాగింది. ఈ వార్తలపై స్పందించిన జితేందర్‌రెడ్డి అలాంటిదేమీ లేదని వివరణ ఇచ్చారు. తనకు టికెట్ దక్కకపోవడంతో పరామర్శించేందుకే సీఎం వచ్చారని, తమ మధ్య ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదని స్పష్టంచేశారు. తాను బీజేపీలోనే ఉన్నానని, తన భవిష్యత్తును పార్టీయే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. టికెట్ దక్కకపోవడం బాధ కలిగించినా, పార్టీలో కొనసాగాలా? వద్దా? అనేదానిపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని జితేందర్‌రెడ్డి స్పష్టంచేశారు.

రైతులపై బ్యాంకర్ల వివక్ష

- రుణం చెల్లించకుంటే భూమి జప్తు చేస్తున్నారు
- అదే బడా వ్యాపారులపై ఉదాసీనత ఎందుకు?
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ): వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతుల పట్ల బ్యాంకర్లు వివక్ష చూపుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన బ్యాంకర్ల సమితి సమావేశంలో మంత్రి మాట్లాడారు. బడా వ్యాపారులు తీసుకున్న రుణాల రికవరీలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న బ్యాంకులు, రైతు రుణాల రికవరీలో మాత్రం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని అన్నారు. రైతులు ట్రాక్టర్లు కొనుగోలు చేస్తే వారి భూములను తాకట్టు పెట్టుకొని రుణాలిస్తున్నారని, అదే బడా వ్యాపారులకు ఎలాంటి గ్యారెంటీతో రుణాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. బ్యాంకింగ్ వ్యవస్థ నిబద్ధతగా ఉండాలని, కలుషితం కావొద్దని సూచించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బ్యాంకులు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రుణాలు ఇవ్వడం బ్యాంకర్లు తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. తమ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకొన్నదని, రుణాల విషయంలో రైతుల పట్ల నిర్లక్ష్యం, అసహనం ప్రదర్శించొద్దని సూచించారు. రైతులు, నిరుద్యోగులకు రుణాల ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ఆస్తులను తప్పనిసరిగా తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు.

అభద్రతాభావంలో సీఎం రేవంత్

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అభద్రతాభావంలో ఉన్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ప్రజాస్వామికంగా ఎన్నికల పద్ధతిలోనే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి అభద్రతాభావంలో ఉండి.. తమ ప్రభుత్వాన్ని బీజేపీ కూలదోసేందుకు ప్రయత్నిస్తున్నదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారంటూ సీఎం పదేపదే వ్యాఖ్యలు చేస్తున్నారని, పూర్తి మెజార్టీ ఉన్నా ప్రభుత్వం కూలిపోతుందనే అనుమానం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనకు లోక్‌సభ ఎన్నికలు రెఫరెండం అని.. రాష్ట్రంలో 14 సీట్లు గెలుస్తామని.. సీఎం పదేపదే చెప్తున్నారని, ఒకవేళ మాట నిలబెట్టుకోకపోతే రేవంత్ నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నేడు రాష్ట్రానికి మోదీ

మూడు రోజులపాటు పర్యటన

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రంలో మూడు రోజుల పాటు (15, 16, 18 తేదీల్లో) ఎన్నికల ప్రచారం చేయనున్నారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొని, శనివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే విజయ సంకల్ప సభకు హాజరుకానున్నారు. ఈ నెల 18న జగిత్యాలలోని గీతా విద్యాలయంలో జరిగే సభలో పాల్గొని, కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు.

నేటి నుంచి టీజీ నంబర్ ప్లేట్లు

- వాహన రిజిస్ట్రేషన్‌లో మార్పు
- యథావిధిగా ఆర్టీవో కోడ్‌లు
- రాష్ట్రవ్యాప్తంగా టీజీ 0001 నుంచి నంబర్ సిరీస్ మొదలు
- ఖైరతాబాద్.. 'టీజీ 09 0001'

శుక్రవారం హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్/ సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/హనుమకొండ: రాష్ట్రంలో కొత్త వాహనాల నంబర్లు ఇకపై టీజీతో మొదలుకానున్నాయి. ఇప్పటివరకు కొనసాగిన టీఎస్ సిరీస్‌కు రాష్ట్ర రవాణాశాఖ స్వస్తి పలికింది. శుక్రవారం టీజీ నంబర్ ప్లేట్‌ను విడుదల చేయనున్నది. ఈ అంశంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీనిని పరిశీలించిన కేంద్ర ఉపరితల రవాణాశాఖ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుమతి ఇచ్చింది. దాంతో టీజీ నంబర్ పేట్ల జారీకి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో రవాణాశాఖ అధికారులు శుక్రవారం నుంచి టీఎస్ స్థానంలో టీజీ నంబర్ పేట్లను తీసురాబోతున్నారు. కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకే టీజీ వర్తిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీవో కార్యాలయాల కోడ్స్ కూడా యథావిధిగా ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 0001 నుంచి సిరీస్ మొదలవుతుంది. ఖైరతాబాద్ ఆర్టీవో పరిధిలో 'టీజీ 09 0001' నంబర్ నుంచి సిరీస్ జారీ చేస్తారు. ఈ నంబర్ 9999 పూర్తయిన అనంతరం టీజీ 09A 0001తో సిరీస్ ప్రారంభమై 09A 9999తో ముగుస్తుంది. అనంతరం టీజీ 09B0001తో సిరీస్ మొదలై.. ఇలా జడ్ వరకు సిరీస్ కొనసాగిన అనంతరం టీజీ 09AA 0001తో సిరీస్ ప్రారంభం అవుతుంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి టీజీ నంబర్లు విడుదలవుతాయని రవాణాశాఖ అధికారులు తెలిపారు.

టీఎస్ వాహనాలు మార్చుకోనవసరం లేదు: అధికారులు

టీఎస్ వాహనదారులు టీజీ నంబర్ ప్లేట్ తీసుకోవాల్సిన అవసరం లేదని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఒకవేళ టీజీ నంబర్ ప్లేట్ తీసుకోవాలంటే.. ఆ వ్యక్తికి ఉన్న మోటార్ కారును కన్వర్షన్ చేసుకోవాలి. అంటే క్యాబ్‌గా మార్చుకోవాలి. అప్పుడు యెల్లో నంబర్ ప్లేట్ జారీ చేస్తారు. మళ్లీ దానిని వ్యక్తిగత వాహనంగా మార్చుకోవచ్చు. ఆ సమయంలో ఆర్టీవో కార్యాలయం టీజీ నంబర్ ప్లేట్ జారీ చేస్తుంది. రెండో ప్రక్రియలో ఏ వాహనమైనా సరే సంబంధిత ఓనర్ ఆర్టీవో నుంచి ఎన్‌వోసీ తీసుకొని ఇతర రాష్ట్రానికి వెళ్లాలి. అక్కడ మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అప్పుడు వాళ్లు వాళ్ల రాష్ట్రం నంబర్ ఇస్తారు. అనంతరం మళ్లీ ఎన్‌వోసీ తీసుకొని మన రాష్ట్రానికి రావాలి. మళ్లీ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు కొత్తగా టీజీ నంబర్ ప్లేట్ ఇస్తారు.

ప్రజల ఆకాంక్ష మేరకే మార్చుతున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్

వాహనాల రిజిస్ట్రేషన్‌ను శుక్రవారం నుంచి టీజీతో చేయనున్నట్టు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా ప్రజల ఆకాంక్ష మేరకే టీఎస్ నుంచి టీజీగా మార్చుతున్నామని తెలిపారు. గురువారం హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీజీ అనే పదంలోనే తెలంగాణ ఆత్మగౌరవం ఉన్నదని చెప్పారు.

వచ్చే ఏడాది నుంచి అంగన్‌వాడీల్లో నర్సరీ

- లింగవివక్ష చూపకుండా పిల్లలను పెంచాలి
- స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

రవీంద్రభారతి, మార్చి 14: పిల్లలను లింగవివక్ష లేకుండా పెంచాలని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తల్లిదండ్రులకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో ఉమెన్స్ అచీవర్స్ అవార్డ్స్-2024 కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఇటీవల చాలామంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, పౌష్టికాహార లోపం వల్లే ఈ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి నర్సరీ తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్ కిట్లను అందిస్తామని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న దాదాపు 200 మందికి మంత్రి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వివిధ రంగాల మహిళా ప్రముఖులు పాల్గొన్నారు.

19 మందికి 'మహిళా' పురస్కారాలు

- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన నారీమణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8వ తేదీ) సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. సాహిత్యం, కళలు, సమాజసేవ ఇలా పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన 17 మందితోపాటు రెండు సంస్థలను మహిళా పురస్కారాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తానిపర్తి చికిత (ఆటలు), కుడుముల లోకేశ్వరి (ఆటలు), ముక్తేవి భారతి (సాహిత్యం), దీవనపల్లి వీణావాణి, సురయా జబీన్ (ఉర్దూ సాహిత్యం), బండ సరోజన (విద్య), బీనా కేశవరావు (హస్తకళలు), గుర్రాల సరోజ (సమాజసేవ), జమీల నిషాత్ (సమాజసేవ), అరిపిన జయలక్ష్మి (ప్రత్యేక విభాగం), దయ్యాల భాగ్య (నృత్యం-ప్రత్యేక ప్రతిభావంతురాలు), ప్రొఫెసర్ అరుణ భిక్షు (నృత్యం, కూచిపుడి), సునీల ప్రకాశ్ (పేరిణి నృత్యం), బండి రాములమ్మ (బోనాల కోలాటం), గొరిగె నీల (బోనాల కోలాటం), మత్తడి సరవ్వ (డప్పు కళాకారిణి), సీహెచ్ పుష్ప (సేంద్రీయ వ్యవసాయం), లుఖ్మా కమ్యూనిటీ కిచెన్, సఫా ఎన్జీవో (ఔత్సాహిక పారిశ్రామిక విభాగం), శక్తి టీం (దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ ఆర్పీఎఫ్) అవార్డులకు ఎంపిక చేసింది.

'కొడుమూరు' ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్

మున్నేరు ఆనకట్ట, కలువల చెక్‌డ్యామ్‌కూ అనుమతులు

హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వెలుగుమట్ల గ్రామ సమీపంలో నిర్మించతలపెట్టిన కొడుమూరు వందనం ఎత్తిపోతల పథకం ఫేజ్-2కు రూ.35.75 కోట్లకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు సాగునీటి పాదరుల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగార్జునసాగర్ 21వ మెయిన్ బ్రాంచి కెనాల్‌పై 9.25 కిలోమీటర్ల వద్ద దీనిని నిర్మించనున్న ఈ పథకం ద్వారా 2,500 ఎకరాల మిగులు ఆయకట్టుకు సాగునీరు అందనున్నది. ముదిగొండ మండలం పండ్రేగుపల్లి సమీపంలో మున్నేరు నదిపై ఉన్న ఆనకట్ట మరమ్మతులకు రూ.107.30 కోట్లను, కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలో కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.63 కోట్లకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

చేసిన పనులకు పైసలివ్వరా!

మొదటిపేజీ తరువాయి...

మూడునెలలు అవుతున్నదని, ఇంకో మూడునెలలు గడువు కోరడం ఏమిటని ప్రశ్నించింది. బిల్లుల క్లియరెన్స్ విధానం ఎలా ఉన్నా కోర్టు అదేశాలు అమలు చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. డాక్టర్ తన దగ్గరకు వచ్చిన సాధారణ రోగికి వైద్యం చేయడానికంటే ముందు ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారని, అదేవిధంగా పనులు పూర్తిచేసిన వాటికి ప్రభుత్వం ముందుగా బిల్లులు చెల్లించాలని వ్యాఖ్యానించింది. ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణి ఎంత మాత్రం ఉపేక్షించబోమని తేల్చి చెప్పింది. సాంకేతిక కారణం చూపి విచారణను వాయిదా కోరడం సబబుకాదని వ్యాఖ్యానించింది. బిల్లులను ఏప్రిల్ 4లోగా చెల్లించాల్సిందేనని ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

6 లక్షల ఎకరాల్లో తగ్గిన యాసంగి సాగు

హై